# చీలిన చీకటిలో విరిసిన వేకువ

– రసరాజు

జగన్నాధుని రథం శోభాయమానంగా ఉంది వసంతం వెల్లివిరిసినట్లుంది.

చుట్టూ మామిడితోరణాలు—నిండుగా విరళంగా ఊగుతున్నాయి.

అటూఇటూ పెద్దపెద్ద అరటిచెట్లు— పచ్చగా పండుముత్తయిదువుల్లా వెలిగిపోతున్నాయి.

మధ్యమధ్య రకరకాల పూలమాలలు— పరమేశ్వరుని సన్నిధానంలో తృప్తిగా పరవశించి పోతున్నాయి.

రథానికి అటూయిటూ కట్టిన రెండు పొడుగాటి త్రాళ్ళను పట్టుకొన్న భక్తులు—రథంలాగే అవకాశం కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు.

జనం—నేల ఈనినట్లుగా ఉన్నారు.

రథోత్సవం తిలకించడానికి నగరం నలుమూలలనుండి వచ్చిన భక్తులతో ఆ ప్రదేశం కిటకిటలాడిపోతుంది. డబ్బు పోయిందనో, తప్పిపోయారనో, ప్రమాదం జరిగిందనో ఏవో ఫిర్యాదులు రక్షణశాఖకు అందుతూనే ఉన్నాయి.

అక్కడికి పోలీసులు అప్రమత్తతతో జనాన్ని అదుపులో పెడుతూనే ఉన్నారు.

అయినా గందరగోళం తాండవిస్తూనే ఉంది

*   *   *

రాత్రి ఏడు గంటలయింది.

రథం ఊరేగుతూ వచ్చి నడివీధిలో రావిచెట్టుదగ్గరాగింది.

అప్పటికే జనం అక్కడంతా నిండిపోయారు. రథం ఆగినచోట ఎప్పుడూ ఏవో ప్రత్యేక కార్యక్రమాలు జరగటం రివాజు.

అయ్యప్పగారు ట్రస్టుబోర్డు చైర్మన్ అయినప్పట్నుంచి ఆ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడూ అంతే!

ఆ కార్యక్రమాల్లో బాణాసంచా కార్యక్రమం ఒకటి. దానికో విశిష్టత ఉంది.


సుమారు 2 గంటలసేపు జరిగే ఆ కార్యక్రమంలో ఎన్నో కొత్తకొత్త విధానాల్లో పోటీలుపడి మందుల్ని కాలుస్తుంటారు.

ఆ సంవత్సరం అందర్నీ ఏది ఆకర్షిస్తే దానికి అయ్యప్పగారు ప్రథమబహుమతి ప్రకటిస్తారు.

తర్వాత విచిత్రవేషాల పోటీ ప్రారంభమవుతుంది.

ఆ తర్వాత కర్రసాములు, నాటకాలు.... ఇలా తెల్లవార్లూ నిర్విరామంగా ఆ ప్రదేశం కళకళ్లాడుతూనే ఉంటుంది.





రథానికి పదిగజాల దూరంలో ఒక అల్లరి మూక అప్పుడే వచ్చిచేరింది.

అక్కడ కొంతమంది హిప్పీకుర్రాళ్ళు నిలబడి అమ్మాయిల్ని ఆదేపనిగా ఏడిపిస్తున్నారు. నవీన నాగరికతకు చిహ్నంగా చిన్నచిన్న రుద్రాక్షమాలలు. లాకెట్స్ గుండెలదాకా వేలాడుతున్నాయి. కేరింతలూ. ఈలలతో అమ్మాయిల్ని గుచ్చిగుచ్చి చూస్తూ చలోక్తులు విసురుతున్నారు.



ప్రతిసంవత్సరం యథాతథంగా ఆ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

మైక్‌లో ప్రకటన వెలువడింది.

మరో 10 నిమిషాల్లో బాణాసంచా కార్యక్రమం మొదలవుతుందని. నిశ్శబ్దంగా ఉండవలసిందని ఆ ప్రకటన సారాంశం.

ఆ హెచ్చరిక వినీవినడంతోనే జనంలో త్రొక్కిసలాట మొదలయింది.

పోలీసులు లాఠీలు పైకెత్తారు.

వాతావరణం బాగా అనుకూలించడంతో "దొంగ–దొర" తారతమ్యం తెలీకుండాపోయింది. యువకబృందం చేసే చిలిపిచేష్టల్ని కొంతమంది అమ్మాయిలు ముద్దుగా మూతివిరుచుకుంటూ రిసీవ్ చేసుకొంటుంటే– మరికొంతమంది శాపనార్థాలతో దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ వ్యవహారం అన్ని తిరునాళ్లలో జరిగినట్లుగానే ఇక్కడా యథావిధిగా జరిగిపోతుంది.

సమయం 8 గంటలయింది.

సైరన్ దిగంతాల్ని తాకేలా ఒక్కసారిగా గొంతుచించుకుంది.

ఊరకుక్కలు "సై" అంటూ శ్రుతి కలిపాయి.

ఇలా 2 నిమిషాలు గడిచాయి.

మరునిమిషంలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగింది.

అంతే!

వెలిగే విద్యుద్దీపాలు ఒక్కసారిగా ఆరిపోయాయి.

ప్రజావాహినిలో కలకలం, రణగొణధ్వని క్రమంగా చెలరేగాయి.

మబ్బుపట్టిన ఆకాశంలో చంద్రుడు మరీ గుడ్డివెన్నెల్ని ప్రసరిస్తున్నాడు.

పిల్లలు కీచుమంటున్నారు ఏమీ తోచక.

తిరునాళ్ల చూడ్డానికొచ్చిన జనం భయం భయంగా గుండెల్ని అరచేతుల్లో పెట్టుకొని బిక్కు–బిక్కుమంటూ ఎక్కడివాళ్ళక్కడ నిలబడిపోయారు.

కొంతమంది ఈ కాలం పిల్లలు జనసందోహం నుండి బయటపడటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అలా ప్రవర్తిస్తున్న నలుగురమ్మాయిల మీద అల్లరిమూక కళ్ళు ఆకలి పాతాళ్లా పడ్డాయి.

ఆ కళ్ళల్లో చిలిపికోరిక ఒక్కసారిగా రెక్కవిప్పింది.

రౌడీతనం ఒళ్ళు విరుచుకుంది.

మంచీ–చెడూ పూర్తిగా మరుగునపడిపోయాయి.

ఆ అల్లరిమూకకు నాయకత్వం వహిస్తున్న ఓ హిప్పీకుర్రాడు–మరో కుర్రాడ్ని ఓ అమ్మాయి మీదికి బలంగా తోశాడు.

జనం.........

అలజడి.........

ఆందోళన.........

అల్లరిమూక తెలివిగా ఆ ప్రదేశాన్ని వదిలి పెట్టింది.

❊ ❊ ❊

పాతసినిమాలోని ఓ హిట్‌సాంగ్ పాడుకొంటూ అప్పుడే రిలీజయిన సినిమా చూసి ఇంటికొచ్చాడు రాజేష్.

ఇల్లు తాళం వేసుంది.

రీడింగ్‌రూం తలుపుతీసుకొని లోపలికి నడిచాడు. ఎవరూ ఎక్కడా మసులుతున్న జాడ కనిపించడంలేదు. ఇంటినౌకరు లచ్చన్న కూడా కనపడటంలేదు.

ఆలోచించాడు.

కారణం అర్థమైంది.

పరంధామయ్యగారింట్లో పెళ్ళికి తనూ వెళ్ళవల్సిందే. కాని, ఆ విషయం ఇప్పటి వరకు గుర్తుకురానేలేదు. ఇంట్లో వాళ్ళంతా అక్కడికే వెళ్లుంటారని భావించి తాపీగా సిగరెట్ వెలిగించి కుర్చీలో కూలబడ్డాడు.

ఎదురుగా తెరిచిన కిటికీ—

అందులోంచి ఏవేవో దృశ్యాలు.

తలలు విరబోసుకొని గాలికి అటూయిటూ దయ్యాల్లా ఊగుతున్న పొడుగాటి కొబ్బరి చెట్లు.........

యూకలిప్టస్ తోటలోంచి దూసుకొస్తున్న భయానకమైన గాలిహోరు....

దూరంగా ఉన్న కరెంటు స్థంభంపై అగ్గి రవ్వలాంటి ఎర్రటి చిటపటలు....

అన్నీ పరిశీలిస్తున్నాడు.

రాత్రిఅయి చాలాసేపయినా నిద్రరాకపోవడంతో రాజేష్‌కి ఏమీ తోచకుండా ఉంది. చుట్టుపక్కల ఇళ్ళుకూడా ఏమీలేవు. చాలా దూరం పోతేనేగాని జనసంచారం కనిపించదు. తనుంటున్న ఇల్లు ఎక్కడో పొలాల మధ్యగా ఉంది.

కిటికీ ఊచల్లోంచి అలా చూస్తూనే ఉన్నాడు.

కాసేపటికి కళ్ళు మూతపడ్డాయి.

రాజేష్ నిద్రలోకి జారుకున్నాడు.

సమయం 3 గంటలు కావస్తుంది.

ఎవరో తలుపుకొడుతున్న శబ్దం.

ఉలిక్కిపడి లేచాడు రాజేష్.

వీధిలైటువేసి బయటికొచ్చాడు.

ఎదురుగా లచ్చన్న!

అతని మూగగొంతులో ఏదో వెలికిరాని ఆవేదన సుళ్లు తిరుగుతోంది.

అటూఇటూ సైగచేస్తున్నాడు.

రాజేష్‌కి గుండె బరువెక్కింది.

లచ్చన్న ఏదో చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

కాని, అతని మూగగొంతు ఆ బాధను అంతరంగంలోకి తొక్కేస్తుంది.

రాజేష్‌కి రేఖా మాత్రంగా అర్థమయింది విషయం.

మరో నిమిషం అక్కడ నిలబడలేకపోయాడు.

తలుపు తాళంవేసి లచ్చన్నతోపాటు తనూ వీధిలో కొచ్చాడు.

చర్చిలో గంటలు మూడుసార్లు మూలగటం వినిపించాయి.

లచ్చన్న తీసుకొచ్చిన టాపులేని రిక్షాలో రాజేష్ ఎక్కికూర్చున్నాడు.

లచ్చన్న ఆ పక్కనే కింద ఒదిగికూర్చున్నాడు.

రిక్షా కదిలింది.

రాజేష్ ఆకాశంలోకి 'చూశాడు అయోమయంగా.

వెన్నెలలేదు,

వెలుగంటే గిట్టని అభివృద్ధి నిరోధకుల్లాంటి మబ్బులు చంద్రునిచుట్టూ దడికట్టాయి.

రిక్షా వచ్చి ఓ నర్సింగ్‌హోమ్ దగ్గరాగింది.

రాజేష్ రిక్షాదిగి హాస్పిటల్‌లోకి అడుగు పెట్టాడు.

ఆశ్చర్యం!

ఆవేదన!

భయం....

అన్నీ ఆ సెకన్లో అతన్ని ఆవహించాయి.

ఆ దృశ్యం చూడగానే అతనికి ఒక్కసారిగా కళ్ళుతిరిగాయి.

రక్తం గడ్డకట్టుకుపోతున్నట్లనిపించింది.

గుండె కొట్టుకోవడం ఎక్కువయింది.

రాగిణి తన తోడబుట్టిన చెల్లెలు— బరువుగా బాధగా మూలుగుతున్న దృశ్యం.

అక్కడక్కడా గాయాలు....కట్లు....

వేలాడుతున్న సెలైన్ బాటిల్స్....

అటూఇటూ హడావిడిగా తిరుగుతున్న హాస్పిటల్ సిబ్బంది....

భయంభయంగా కనులనీరు నింపుకొని దైన్యంగా చూస్తున్న తలిదండ్రులు.

రాజేష్ మనస్సు పిచ్చిగా రోదించింది.

మాట రాలేదు.

బరువైన నిట్టూర్పు....

రాగిణి బ్రతకాలని కోటిదేవుళ్ళకు మొక్కుకున్నాడు.

కొంత సమయం గడిచింది(

రాజేష్ రాగిణి పాదాలకు దగ్గరగా కూర్చున్నాడు.

భయంభయంగా బరువుగా గడుస్తున్న ఆ శేషరాత్రిలో రాగిణి గురించి రాజేష్ తెలుసుకున్న పూర్తివివరం ఇది—

తిరునాళ్ళలో దీపాలు ఆరిపోయిన సమయంలో రథం ముందున్న అల్లరిమూకలోంచి ఓ కుర్రాడు హఠాత్తుగా వచ్చి మీదపడటంతో నిలదొక్కుకోలేని రాగిణి కిందపడి తొక్కిసలాటలో బలంగా గాయపడిందని....

రాజేష్‌కి షాక్ కొట్టినట్లయింది.

మెదడులోని ఒకో రక్తనాళం చిట్లిపోతున్నట్లనిపించింది.

బరువెక్కిన గుండె తెగిపోతున్నట్లనిపించింది.

ఆత్మక్షోభ అతన్ని నిలువునా దహించేస్తుంది.

రాగిణి ప్రమాదానికి హిప్పీ నాయకుడిగా తనే కారణమన్న విషయం అతన్ని మరీ చిత్రవధ చేస్తుంది.


అతని మూగబాధ గొంతుదాటి రావడం లేదు.

రాజేష్ విడిచిన కన్నీటి బిందువులు రాగిణి పాదాల్ని పదేపదే క్షమాభిక్ష వేడుతున్నాయి.

తెల్లవారింది.

రాగిణి కళ్ళు తెరిచింది.

చీలిన చీకటిలోంచి విరిసిన వేకువ రాజేష్ పశ్చాత్తాప హృదయానికి ఏదో ప్రబోధిస్తుంది ●




Edited, Printed and Published by D. Bheem Reddy for Kakatiya Publications,
5-8-55 A, Nampally Station Road, Hyderabad-500 001, Phone: 234181
Madras Office: Chitrabhoomi film Weekly. 182 North Osman Road, T. Nagar Madras-17.